# సాగుతున్న యాత్ర



సౌభాగ్యవతి

తెల్లని వెన్నెట్లో, ప్రశాంతతను ఛేదిస్తూ పోతున్న రైలు — అందులోనూ — అతనూ — పాపాయి. ఏమిటో హాయిగా వుంది సుమిత్రకి, ఏడేళ్ళ తర్వాత తను మళ్ళీ పుట్టి పెరిగిన, చదువు సంధ్యలు సాగించిన ఊరికి వెడుతోంది. ఎలా వుందో శ్రీకాకుళం! తను చదువుకునే రోజుల్లో కాలేజీ కొత్తది — చిన్న చిన్న గడ్డి యిళ్ళల్లో క్లాసులు — పార్వతికి పెళ్ళయిందో, లేదో — జానకి ఎందరు పిల్లలో, క్రిష్ణవేణి ఆ బి. ఏ యిప్పటికైనా పూర్తిచేసిందో లేదో,... ఒకసారి శ్రీకాకుళం దగ్గరి తాతగారి ఊరు కూడా చూస్తే ఎంత బావుణ్ను! అక్కడి నదీ తీరం దేవాలయంలోని మాలతి తీగా, చిన్నప్పుడు జాలారి గోపాలుణ్ని బతిమాలి ఆ పూలు కోయించుకోవటం అన్నీ గుర్తొచ్చాయి.

ఏమిటో ఈ ఏడేళ్ళూ యిట్టే గడిచి పోయినట్టుగా వుంది. ఆయనతోడి తన పరిచయం, చెలిమీ, ప్రణయం, పరిణయం — తర్వాత హాయిగా గడిపిన నెల్లాళ్ళ తేనె వెన్నెల రోజులూ — పూరీ, గోపాలపురం — సముద్ర స్నానానికి భయపడ్డ తనని, అతను రెక్కపుచ్చుకొని 'కొంగు కొంగూ కలిపి పరి గంగ తానాలు. సేదామా!' అని స్నానం చేయించటం — ఇట్టే రీళ్ళల్లా రావటమేమిటీ, అతనికి ముక్కూ మొహం తెలీని రాజస్థాన్‌లో ఉద్యోగమవటం ఒక్కసారే జరిగేయి, అంతే రాజస్థాన్‌కి ప్రయాణం. శ్రీకాకుళం వదిలేసి అంతదూరం పోతుంటే ఏదో బాధ; గుండెలలో భాగమేదో అక్కడ వదిలేసినట్టు. అక్కడికి వెళ్ళిన కొత్తలోనే పాపాయి కడుపున పడటం! ఇంత దూరంలో అమ్మావాళ్ళకి దూరంగా ఏమవుతుందో, ఏమిటో అని తన బెంగ! సిగ్గుతో, బెంగతోను చెప్పగా, 'ఇక్కడ అమ్మమ్మలూ, బామ్మలూ లేరుకానీ హాస్పిటలూ, డాక్టర్లూ వున్నారు సుమిత్రా!' అని అతను తనను అనునయించేడు. అనుకున్న సమయానికి అమ్మరాలేక పోయింది; తను ప్రయాణం చేయకూడదని డాక్టరు హెచ్చరిక అయితేనేం స్నేహితులు సహాయపడ్డం వల్ల పురుడూ, ఉయ్యాల్లో పెట్టటం అన్నీ ఆనందంగా గడిచి పోయినయ్. తల్చుకుంటే యిప్పటికీ నవ్వొస్తుంది, ఆ రోజుల్లో అతని హడావిడీ, ఆనందాన్నీ.

'ఏమిటోయ్ ఆ గత స్మృతులు? హాంటింగ్ పెర్‌ఫ్యూమ్స్! నన్నూ పంచుకోనీ'—

అతని పలకరింపుతో ఆలోచనల నుంచి తెప్పరిల్లుకుని 'అలాటివేం నాకు లేవు. వాల్తేరు వస్తోందని మీరే మురుస్తున్నట్టున్నారు. ఎంతైనా చదువుకున్న వూరు. బాల్యక్రీడలు గుర్తొస్తున్నాయా?' — అంది గడుసుగా సుమిత్ర.

* * *

మనవరాల్ని ముద్దుపెట్టుకుంటూ 'వచ్చావా తల్లీ!' అని సుమిత్ర తల్లి పల్కరించింది. లోపల్నించి వదినా, అన్నయ్యా హడావిడిగా వచ్చారు. బాల్చితో నీళ్ళుతెచ్చి, 'పదమ్మా

స్నానం చేదావ్గాని' అని పాపాయిని పిలుస్తే 'ఊహూఁ! నాకొద్దు, షవర్ కావాలి' అంటూ గునుపు ప్రారంభించింది. ఎలాగైతేనేం కేక లేని స్నానం అయిందనిపించి — అక్కడిలాగే టేబిల్ మీల్స్, సీలింగ్ ఫ్యాన్ అన్నీ కావాలంటుంది కాబోలు భగవంతుడా అని సుమిత్ర బెంగెట్టుకుంది. పాపాయి మాటలకు అమ్మా, ఒదినా బుగ్గలు నొక్కుకున్నారు చాటుగా. ఏమిటో ఈ యింట్లో అన్నీ తనకే కొత్తగా వున్నాయి. కట్టెలపొయ్యిమీద వంట, నల్లగా మూడంగుళాలెత్తు మసిబారిన వంటిల్లూ, రోజల్లా ఒవెన్‌లో వున్నట్టు అందులో సతమతమైపోవటం — అబ్బబ్బ! ఏమిటో ఈ మనుష్యుల తత్వాలెన్నడు మార్తాయో కదా! అనుకుంది.

ఒదిన కొడుకుని ముద్దాడుతూ, 'వీడి కన్నేళ్లొదినా?' అంది. 'అదేం చోద్యమే? నీ పెళ్ళిముందేగా పుట్టిందీ వీడు?' అంది అమ్మ కోప్పడుతూ. 'భయపడ్తోంది కాబోలత్తయ్యా! వాళ్ల ముద్దులపట్టి నివ్వాలేమోనని! అంత భయపడకమ్మోయ్!' ఒదినగారి వ్యంగ్యం.

సంభాషణ ఎలా, ఏ విషయంమీద మొదలెట్టినా అది వ్యంగ్యాలతోనూ, శ్లేషలతోనూ సాగటం, అసలు అన్నయ్యేనా, ఆఫీసు— పని అని వెళ్లిపోటమేకానీ, నవ్వుతూ 'చెల్లాయ్!' అని ఒక్కరోజు మాటాడిన పాపాన పోలేదు. ఆయనతో అసలే లేదు. సుమిత్ర కూడా ముభావంగా వుండక తప్పలేదు. చాలా బాధ అనిపించింది. తనవాళ్ళు వీళ్ళు! అయితేనేం వాళ్లకీ తనకీ ఎంతదూరం! మనసుల్లో ఏదో భావం! తన్ను వాళ్ళు కలుపుకోటం లేదు. అమ్మకికూడా తననిచూస్తే ఓరకమైన ఈర్ష్య! ఎంతదూరమైపోయింది అమ్మకి తను! గుండెలు బరువెక్కాయి. ఎంతో హెల్ప్‌లెస్‌గా ఫీలయింది తను. తననీ, తన చీరల్ని తామిద్దరి అన్యోన్యతనీ చూసి మాటిమాటికీ ఒదిన మొహం ముడుచుకోటమే;

ఆర్రాత్రి అతను ఆమె బాధ నరంచేస్కుని, 'ఏం అమ్మాయిగారూ! యిహ మా వూరు వెళ్దామా?' అన్నాడు.

* * *

'మిత్రా! సుమిత్రా! సుమీ! సుమిత్రాదేవీ చల్లటి మంచినీళ్ళిద్దూ ప్లీజ్!' ఆమె తెచ్చేలోగానే ఎదురొచ్చేడు. అతని చెల్లెలు యిందిర పెద్ద ఒదినతో అంటోంది. 'ఒదిన ఒక్కక్షణం కన్పించక పోయేసరికి విరహ గీతికలు పాడ్తాడేమిటి ఒదినా, చిన్నన్నయ్య?' అని. 'ప్రేమపెళ్ళి కదుటమ్మా? మనమేం ఎరుగుదుమా ఏమన్నానా? ఏమైనా పెళ్ళాన్ని పువ్వులా చూసుకుంటాడు మా మరిది; దేనికైనా అదృష్టం వుండొద్దూ!' తోటికోడలి రిమార్కు. ఆమాటలు చెవినపడి సుమిత్ర మొహం ఎర్రబడ్డది. అతను విన్నా ఆశ్చర్యపడలేదు; సుమిత్ర భుజాలు రెండూ మెల్లగా నొక్కి వెనక్కి తిరిగేడు. తమ సాన్నిహిత్యం, అనురాగం చూసి వీళ్ళలాగ అనుకోకమానరని అతనికి తెలుసు. అదేమిటో! పెళ్ళివాడు నవదంపతుల్ని ఆశీర్వదించిన పెద్దలే, వాళ్ళ అనురాగం చూసి, ముచ్చటపడకుండా, అసూయపడ్తారు. అయితేనేం...తనవాళ్ళూ అంటే, సొంత వూరూ అంటే అభిమానం లేనిదెవరికీ. ఇక్కడికొచ్చినదగ్గరినుంచీ, తన చిన్నతనం మనసులో మెదుల్తోందతనికి.

ఆ సాయంత్రం బీచ్‌లో అందరూ కబుర్లు చెప్పుకుంటున్నారు, 'ఇందూ! సముద్రం చూస్తూంటే నాకు మంచి సంగతి గుర్తొస్తోందే'. అన్నాడు చెల్లితో; సుమిత్రని క్రీగంటచూస్తూ తేనె వెన్నెల రోజుల మధురిమని తల్చుకుంటూ.

'ఏమిటో చెప్పన్నయ్యా!' అంది యిందిర.

'మీ ఒదిన్ని అడుగు పూరీలో ఏం జరిగిందో?'

కళ్ళతోనే వారించింది సుమిత్ర; అయినా అతను వుత్సాహంగా చెప్పుకుపోతూనే వున్నాడు అతను 'ఇందూ! మౌంట్ అబూ వెళ్ళామా. అక్కడ నౌకా విహారం బలే వుంటుందిలే. కావాలంటే సుమిత్ర నడుగుదూ! ఆ దిల్వారా ఆలయ సౌందర్యం...

'ఎటుదిరిగి ఏది చెప్పినా అది సుమిత్ర చుట్టూ పరిభ్రమించాల్సిందే నేమిటోయ్?' అంది ఒదిన సున్నితంగా దెప్పిపొడుస్తూ.

ఉక్కిరిబిక్కిరిగా, యిబ్బందిగా ఫీలయింది సుమిత్ర. తమ యిద్దరి సాన్నిహిత్యం యిప్పటికే వీళ్ళకి ఎబ్బెట్టుగా వుంది. ఆడబడుచు యిందిరా, తోటికోడలు వ్యంగ్యోక్తులూ — అవి విని కూడా తగ్గకుండా, మరింత హెచ్చుగా 'సుమిత్రా!' అంటూ ఈయనగారి గొడవ. ఈ సంభాషణ నింక ఆపుజెయ్యాలని, 'పాపాయికి నిద్ర వస్తోం'దని సుమిత్ర లేచి నుంచుంది. అంతా బీచ్‌నుండి యింటికి రాక తప్పలేదు. ఆర్రాత్రి చేరువగా వచ్చి చెవిలో గుసగుసలాడబోయిన అతనితో, 'మీరూ — మీ మాటలూ నా తలెత్తుకోకుండా చేస్తున్నారు. ప్రేమవుంటే మనసులో వుంచుకోవాలి కానీ......' సుమిత్ర పూర్తి చేయకముందే 'సుమిత్రా! మనం కేవలం భార్యాభర్తలమే కాదు — మనం ప్రాణస్నేహితులం. ఒకరి అనుభూతులనూ, అనుభవాలనూ పంచుకుంటున్నాం. అసలు ఈ చెలిమి ఈ జన్మలోనిది మాత్రమేనా?' 'ఎనక జల్మములో ఎవరమో!' ఏం ఎంకీ?' అంటూ అనునయించబోతుంటే, 'ఎంకీ లేదు, గింకీ లేదు. మనవూరు వెళ్ళేదాకా నా జోలికి రాకండి' అంది సుమిత్ర.

అతని అహం దెబ్బతింది. మరి మాటలు తగ్గిపోయాయి. శిలవైపోయి, వాళ్ళవూరు వెళ్ళినా నిర్లిప్తత తగ్గలేదు. ఎంత చిన్న విషయమైనా ఒకరికొకరు గంటలతరబడి చెప్పుకునే తాము, యిలా ముభావంగా వుండటం యిద్దరికీ ఆశ్చర్యంగానే వుంది. దీనికి ముగింపెన్నడు? ఈ ఆలోచనల్లో మునిగివున్న సుమిత్ర బుగ్గల మీదుగా జారుతున్న అశ్రువుల్ని చూసుకొననేలేదు. అప్పుడే యింట్లో అడుగుపెట్టిన అతను ఆ దృశ్యం చూసి కరిగి నీరైపోయాడు.

'సుమిత్రా! నీ బాధ నాకు తెలుసు. ఏదో నువ్వన్నావు — నాకూ కోపం వచ్చింది. ఏదేమైనా యిప్పటికి అనుభవించిన శిక్ష చాలు. నీవాళ్ళకి నువ్వూ, నావాళ్ళకి నేనూ ఎల్లాగూ దూరమయ్యాం. పెళ్ళయ్యాక మనకో ప్రత్యేక పరిధి ఏర్పడింది. పెళ్ళికాక ముందరి సర్వసౌభ్రాత్రత్వం వుండటానికి అవకాశం తక్కువ. అది చేదు నిజం. మనం ఒకరికొకరు యిలా దూరమై సాధించేదేం లేదు. వలపుబాట కంటకావృతం — అయినా మనం కలిసి సాగించాల్సిందే ఈ యాత్ర!

'కోరికలనెల్ల మరచి నాకొరకు నీవు
నీకొరకు నేను, తొలివేగు దోకలాల
పూలజత వోలె ఈ సుధాపూరమందు
తేలిపోదము జన్మజన్మాల యాత్ర!'

అని పాడేడతను. పరవశమై కరగిపోయిందామె!